సాక్షి
రాజన్న సిరిసిల్ల
మంగళవారం | 19 | మార్చి | 2024



తండాల్లో తాగునీటి గోస

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండలం సీతారాంనాయక్‌తండా, జవహర్‌నాయక్‌తండాల్లో తాగునీటి గోస తీవ్రంగా ఉంది. ఇప్పటికే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళ 6:32	బుధ 5:00

గరిష్ఠం/కనిష్ఠం 33.0/24.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి వేళ చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నక్సలైట్ల పేరుతో బెదిరిస్తే కఠిన చర్యలు

- ఎస్పీ అఖిల్ మహాజన్



సిరిసిల్లక్రైం: జనశక్తి నక్సలైట్ పేరుతో ప్రజలను బెదిరిస్తే కఠిన చర్యలకు వెళ్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. జనశక్తి పార్టీ ఫండ్ పేరిట డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్న సిరిసిల్ల పట్టణానికి చెందిన పి.సాయిని సోమవారం రిమాండ్ చేసినట్లు వెల్లడించారు. సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌కు చెందిన పి.సాయి నిషేధిత విప్లవసంస్థ జనశక్తి, అరుణోదయ సంస్థల్లో పనిచేస్తున్నానని ప్రజలను బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిపారు. పార్టీ ఫండ్ పేరిట ప్రజల వద్ద డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నాడని కోనరావుపేట పోలీసులు రిమాండ్ చేసినట్లు తెలిపారు. నిషేధిత సంస్థల పేరిట బెదిరింపులకు పాల్పడే వారిపై నిఘా ఉంటుందని, ప్రజలకు ఇలాంటి సందర్భాలు ఎదురైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రాష్ట్రస్థాయి జిజ్ఞాసకు నాలుగు ప్రాజెక్టులు



విద్యార్థులతో అధ్యాపకులు

వేములవాడఅర్బన్: అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి రాష్ట్రస్థాయి జిజ్ఞాసకు నాలుగు ప్రాజెక్టులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ తెలిపారు. గత నెలలో కళాశాల నుంచి 12 ప్రాజెక్ట్‌లను పంపించగా 4 ప్రాజెక్ట్‌లు రాష్ట్రస్థాయికి ఎంపికవడంపై అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు. ఎంపికైన ప్రాజెక్టులలో రాజన్నసిరిసిల్ల జిల్లా ప్రాంతంలో 'జానపద గేయ సాహిత్యం', రెండోది 'ద రోల్ ఆఫ్ ఫొనెటిక్స్ ఇన్ ద కమ్యూనికేషన్ వరల్డ్', మూడోది 'ఇంపాక్ట్ ఆఫ్ రైతుబంధు స్కీమ్ ఆన్ ఫార్మర్స్', నాలుగోది 'ఫిజికో కెమికల్ అండ్ బయోలజికల్ వాటర్ ఎనాలసిస్' ఎంపికైనట్లు వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు అఫ్సారీ ఉస్మాని, మధు రాజేశ్, వెంకటేశ్వర్లు, మల్లారెడ్డి, ప్రభాకర్, రాజేశ్, శ్రీనివాసులు, కరుణ, నారాయణ, నర్సయ్య పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్ వైస్ ఎంపీపీగా దేవరాజు



వేములవాడ అర్బన్ మండల వైస్ ఎంపీపీగా ప్రమాణస్వీకారం చేస్తున్న వనపర్తి దేవరాజు

వేములవాడఅర్బన్: వేములవాడ అర్బన్ ఎంపీపీగా వనపత్తి దేవరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మండల పరిషత్‌లో ఆర్డీవో రాజేశ్వర్ ఆధ్వర్యంలో సోమవారం వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. వేములవాడ అర్బన్ మండలంలో ఆరు ఎంపీటీసీ స్థానాలకు నలుగురు ఎంపీటీసీలు.. చీర్లవంచ ఎంపీటీసీ వనపర్తి దేవరాజు(కాంగ్రెస్), అనుపురం ఎంపీటీసీ బస రాజశేఖర్(కాంగ్రెస్), రుద్రవరం ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణ(స్వతంత్ర), సంకెపల్లి ఎంపీటీసీ బుర్ర లహరిక (బీజేపీ) హాజరయ్యారు. వైస్ ఎంపీపీగా వనపర్తి దేవరాజు నామినేషన్ వేయగా, ఎంపీటీసీ బస రాజశేఖర్ ప్రతిపాదించారు. ఎంపీటీసీ బుర్ర లహరిక బలపర్చారు. ఒకే ఒక్క నామినేషన్ రావడంతో వైస్ ఎంపీపీగా వనపర్తి దేవరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా ఆర్డీవో ప్రకటించారు. అనంతరం దేవరాజు ప్రమాణస్వీకారం చేశారు. ఎంపీడీవో రాజీవ్ మల్హోత్ర, తదితరులు ఉన్నారు.

నాణ్యతతో పనులు చేయాలి

- జెడ్పీ సీఈవో ఉమారాణి



రామరావుపల్లెలో సైడ్ డ్రెయినేజీని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో

చందుర్తి(వేములవాడ): అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని జెడ్పీ సీఈవో ఉమారాణి ఆదేశించారు. చందుర్తిలో రూ.1.56కోట్లతో నిర్మిస్తున్న పీహెచ్‌సీ, రామరావుపల్లెలో రూ.5లక్షలతో నిర్మిస్తున్న సైడ్ డ్రెయినేజీలను ఉమారాణి సోమవారం పరిశీలించారు. చందుర్తి మండల పరిషత్ ఆఫీస్‌ను తనిఖీ చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రదీప్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, మండల పరిషత్ సిబ్బంది ఉన్నారు.



సభకు హాజరైన జనం

మరెన్నో ఇస్తాం

- ఎన్‌హెచ్‌–563, ఆర్‌ఎఫ్‌సీఎల్ పునరుద్ధరణ, టర్మరిక్ బోర్డు ఏర్పాటు చేశాం
- రైతులు, మహిళలు, యువతను ఆదుకున్నాం..
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ తెరచాటు మిత్రులు
- బీజేపీని గెలిపించండి
- జగిత్యాల విజయ సంకల్ప సభలో ప్రధాని నరేంద్ర మోదీ



వేదికపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ లక్ష్మణ్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థులు ధర్మపురి అర్వింద్, బండి సంజయ్, గోమాస శ్రీనివాస్, ఎమ్మెల్యేలు రామారావుపటేల్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, బీజేపీ నాయకులు బొడిగె శోభ, బోగ శ్రావణి తదితరులు

సాక్షి ప్రతినిధి,కరీంనగర్/జగిత్యాల/జగిత్యాలరూరల్: తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం.. నిజామాబాద్, పెద్దపల్లి, కరీంనగర్ పార్లమెంట్ సెగ్మెంట్ల పరిధిలో నిజామాబాద్–ఖమ్మం వరకు ఎన్‌హెచ్–563, ఆర్‌ఎఫ్‌సీఎల్ పునరుద్ధరణ, రైలు మార్గాల నిర్మాణం, టర్మరిక్ బోర్డు, నిజాం షుగర్ ఫ్యాక్టరీకి నిధులు.. ఇలా ఎన్నో ఇచ్చాం.. వచ్చే పదేళ్లలో తెలంగాణ ప్రగతిపై ఫోకస్ చేసి, మరెన్నో ఇస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రాష్ట్రంలో రోడ్లు, రైలు, గోదాంలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తామని పేర్కొన్నారు. సోమవారం జగిత్యాల పట్టణంలోని గీతా విద్యాలయం మైదానంలో ఏర్పాటు చేసిన విజయ సంకల్ప సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రసంగించారు. రాష్ట్రంతోపాటు ఉమ్మడి జిల్లాలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. వికసిత్ భారత్, వికసిత్ తెలంగాణ కోసం బీజేపీని గెలిపించాలని, అబ్ కీ బార్ 400 పార్ అని పిలుపునిచ్చారు. పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధరతో రైతులను, సంక్షేమ పథకాలతో మహిళలను, రుణాలిచ్చి యువతను ఆదుకున్నామని తెలిపారు. పసుపు మద్దతు ధర, టర్మరిక్ బోర్డు ఏర్పాటు, నిజాం షుగర్ ఫ్యాక్టరీకి, ఆర్‌ఎఫ్‌సీఎల్ పునరుద్ధరణకు రూ.6,400 కోట్లు వెచ్చించామన్నారు. కాళేశ్వరం అవినీతి విషయంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల తీరును ఎండగట్టారు. ఆ పార్టీలు తెరచాటు మిత్రులని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ అగ్రనాయకులు లక్ష్మణ్, సత్యనారాయణరావు, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, నిర్మల్ ఎమ్మెల్యే పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రజాకార్ సినిమా చూడండి



వీరులను కన్న గడ్డ జగిత్యాలలో పీఎఫ్‌ఐ లుచ్చాగాళ్లు అడ్డా పెట్టి, పాకిస్తాన్ జిందాబాద్ అంటుంటే వాళ్లకు ఆర్థిక సాయం చేస్తున్న వాళ్లను వదిలేద్దామా? నమ్మిన సిద్ధాంతం కోసం ప్రాణత్యాగం చేసిన వీరులు జగిత్యాల సొంతం. రాముని పేరు చెబితే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వాళ్లు గజగజ వణుకుతున్నరు. దేశ ప్రజల భాగస్వామ్యంతో అయోధ్యలో రాముని గుడిని కట్టింది బీజేపీయే. మా పార్టీ బరాబర్ శ్రీరాముని పేరుతో ఎన్నికల్లోకి వెళ్తుంది. మీకు దమ్ముంటే బాబర్ పేరుతో ఓట్లడగండి. తెలంగాణ ప్రజాలారా... ప్రతిఒక్కరూ రజాకార్ సినిమా చూడండి. నిజాం సమాధి వద్ద మోకరిల్లిన కేసీఆర్, ఒవైసీ సోదరులను కట్టేసి, ఈ సినిమా చూపించండి.

– ఎంపీ బండి సంజయ్



దేశ ప్రజలందరూ ప్రధాని కుటుంబమే

ప్రధాని నరేంద్ర మోదీకి కుటుంబం లేదంటున్న విపక్షాలకు సిగ్గులేదు. దేశ ప్రజలందరూ ఆయన కుటుంబమే. వేములవాడ రాజన్న ఆశీర్వాదంతో తెలంగాణ నుంచి బీజేపీ తరఫున అత్యధిక ఎంపీ స్థానాలు గెలిచి, ప్రధానికి కానుకగా ఇద్దాం. పదేళ్ల యూపీఏ హయాంలో జరగని స్కాం లేదు. బీఆర్‌ఎస్ కాళేశ్వరం నుంచి కరెంటు వరకు అవినీతిమయం చేసింది. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేయలేక చేతులెత్తేసింది.

– ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత



ఐదో ఆర్థిక శక్తిగా మన దేశం

ప్రధాని మోదీ వల్లే మన దేశం ప్రపంచ దేశాల్లో బలమైన ఐదో ఆర్థిక శక్తిగా ఎదిగింది. మయన్మార్, పాకిస్తాన్ లాంటి దేశాలను దారికి తెచ్చిన ఘనత ఆయనదే. మోదీ వల్లే దేశంలో సుస్థిరత, సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతాయి. ఇటీవల సీఏఏ అమలు చేశారు. త్వరలో ఎన్‌ఆర్‌సీ, యూసీసీ కోడ్‌ను కూడా అమలు చేస్తారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి.

– ఎంపీ ధర్మపురి అర్వింద్

నీటి సరఫరాపై పక్కా ప్రణాళిక ఉండాలి

- ఇంకుడుగుంతలపై అవగాహన పెంచాలి
- రాష్ట్ర మున్సిపల్ ప్రిన్సిపాల్ సెక్రటరీ దాన కిశోర్

సిరిసిల్ల: వేసవిలో తాగునీటి సరఫరాపై పక్కా ప్రణాళిక ఉండాలని రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ ఆదేశించారు. తాగునీటి సమస్య, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై సీడీఎంఏ డైరెక్టర్ దివ్య దేవరాజన్‌తో కలిసి సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల ఆవరణ, బస్టాండ్, ప్రైవేట్ సంస్థల స్థలాల్లో రాజకీయ పార్టీల బ్యానర్లు, ఫొటోలు, పోస్టర్లు తీసివేయాలన్నారు. మున్సిపాలిటీల్లో ఇప్పటికే పరిపాలన అనుమతులు పొంది మొదలైన ప్రభుత్వ అభివృద్ధి పనులు, పరిపాలన అనుమతులు పొంది ఇంకా మొదలుకాని పనుల వివరాలు సీఈవోకు పంపాలని సూచించారు. తాగునీటి సరఫరాపై ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రత్యామ్నాయాలు చూడాలని తెలిపారు. అదనపు కలెక్టర్లు సమ్మర్ యాక్షన్ ప్లాన్‌తో, మున్సిపాలిటీల్లో మైక్రోప్లాన్‌తో సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రతి చివరి ఇంటికి సైతం నీరు అందేలా చూడాలన్నారు. క్రిటికల్ సమస్య ఉంటే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకురావాలని తెలిపారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ గౌతమి, కమిషనర్లు లావణ్య, అన్వేశ్

ఇంకుడుగుంతలు నిర్మించాలి

వాననీటి సంరక్షణకు ఇంకుడు గుంతల నిర్మాణంపై అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడుగుంతలు ఉండేలా చర్యలు తీసుకోవాలని వివరించారు. నూతన నిర్మాణాల వద్ద ఇంకుడుగుంతలు ఉండేలా చూడాలన్నారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేశ్ ఉన్నారు.



టెన్త్ పరీక్షలు రాసేందుకు వస్తున్న విద్యార్థులు



గీతానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పది పరీక్షలు ప్రారంభం

పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 35 పరీక్షా కేంద్రాలలో 6,472 మంది విద్యార్థులకు 6467 మంది హాజరైనట్లు డీఈవో రమేశ్‌కుమార్ తెలిపారు. కలెక్టర్ అనురాగ్ జయంతి వేములవాడలోని రెండు సెంటర్లు, డీఈవో మూడు సెంటర్లు, జిల్లా పరీక్షల నియంత్రణ సహాయాధికారి రెండు సెంటర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం కోనరావుపేటలోని 3 కేంద్రాలను, ఎల్లారెడ్డిపేటలోని రెండు కేంద్రాలు, ముస్తాబాద్‌లోని రెండు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

– సిరిసిల్ల ఎడ్యుకేషన్/సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల

విరిగిన చెట్లు.. కూలిన స్తంభాలు



బస్టాండ్ ప్రాంతంలో విద్యుత్ స్తంభం విరిగిపడడంతో వేలాడుతున్న కరెంట్ తీగలు

- ముస్తాబాద్‌లో ఈదురుగాలుల బీభత్సం
- టీ తాగేందుకొచ్చి రైతు దుర్మరణం
- హోటల్ యజమానికి గాయాలు
- వడగండ్ల వానతో వరి, మామిడి పంటలకు నష్టం
- ముస్తాబాద్‌లో అంధకారం
- జిల్లాలో పలు ప్రాంతాల్లో చిరుజల్లులు



బస్టాండ్ ప్రాంతంలో కూలిన చెట్టు



హోటల్ డబ్బాపై కూలిపడిన చెట్టు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో మండల కేంద్రంలో ప్రధాన రహదారి వెంట ఉన్న పలు చెట్లు విరిగిపడ్డాయి. ఎస్సీ కాలనీ రెండు స్తంభాలు, బస్టాండ్ ప్రాంతంలో ఒక్క స్తంభం విరిగిపోయాయి. స్థానిక కొత్తబస్టాండ్ పరిసరాల్లో చెట్టు, స్తంభం విరిగి ఓ హోటల్‌పై పడడంతో అక్కడే టీ తాగుతున్న మండల కేంద్రానికి చెందిన రైతు ఎల్సాని ఎల్లయ్య(53) అక్కడికక్కడే మృతిచెందాడు. హోటల్ యజమాని బాబు స్వల్పంగా గాయపడి ప్రాణాలతో బయటపడ్డాడు. బస్టాండ్‌లో ఉన్న ప్రయాణికులు భయాందోళనతో పరుగులు తీశారు. విద్యుత్ స్తంభం విరిగిపడడంతో ముస్తాబాద్ మండల కేంద్రంలో సోమవారం రాత్రి మొత్తం అంధకారం అలుముకుంది. చీకటి కమ్ముకోవడంతో స్థానికులు భయాందోళన చెందారు. విద్యుత్ సిబ్బంది మరమ్మతు పనులు మొదలుపెట్టినప్పటికీ మంగళవారం తెల్లవారితేనే కరెంట్ సరఫరాను పునరుద్ధరణ చేసే అవకాశం ఉన్నట్లు సెస్ సిబ్బంది తెలిపారు. సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి క్షేత్రస్థాయిలో తిరుగుతూ సిబ్బందితో విద్యుత్ పునరుద్ధరణ పనులు చేయిస్తున్నారు.

మండల వ్యాప్తంగా తీవ్ర నష్టం

ముస్తాబాద్ మండలంలోని పోత్గల్, నామాపూర్, గూడెం, మొర్రాయిపల్లె, తెర్లుమద్ది గ్రామాల్లో పడ్డ వడగండ్లతో వరి పంటకు తీవ్ర నష్టం కలిగింది. ఇప్పుడిప్పుడే పొట్ట దశకు చేరుతున్న వరిపంటపై వడగండ్ల వాన పడడంతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితులు లేవని అన్నదాతలు కన్నీటిపర్యంతమవుతున్నారు. మండలంలోని బందనకల్, తెర్లుమద్ది గ్రామాల్లోని మామిడితోటలు దెబ్బతిన్నాయి. పూత, మామిడిపిందెలు రాలిపడ్డాయి. మూడు రోజుల క్రితం ఈదురుగాలులతో కూడిన వర్షం మాత్రమే పడడంతో ఊపిరిపీల్చుకున్న రైతులకు సోమవారం వడగండ్లు కంటిమీద కునుకులేకుండా చేశాయి. జిల్లా వ్యాప్తంగా వరి పంట పొట్ట దశకు చేరుకోగా.. ఇదే సమయంలో భారీ సైజులో ఉన్న వడగండ్లతో కూడిన వర్షం పడడంతో వరి పంట వెన్ను విరిగిపడింది. పొలాల్లో వరిపంట పూర్తిగా నేలవాలింది. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిహారం అందించే చర్యలు తీసుకోవాలని పంట నష్టపోయిన రైతులు కోరుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా చిరుజల్లులు

రాజన్నసిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా సోమవారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. సిరిసిల్ల పట్టణంతోపాటు ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, తంగళ్లపల్లి మండలాల్లో చిరుజల్లులు కురిశాయి. వడగండ్లు కురవకపోవడంతో ఆయా మండలాల్లోని రైతులు ఊపిరిపీల్చుకున్నారు.

గుడి చెరువు పనుల్లో వేగం పెంచండి



రాజన్న గుడి చెరువు పనులపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

- ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగుపరచాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి

వేములవాడ: రాజన్న గుడి చెరువు పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో బండ్, పార్క్ పనులను సోమవారం పరిశీలించి మాట్లాడారు. నటరాజ విగ్రహాన్ని ఆలయ అర్చకుల సలహాలతో ఏర్పాటు చేయాలన్నారు. పిల్లలు ఆడుకునే స్థలం, నడిచే స్థలం విషయంలో అధికారులకు సూచనలు చేశారు. వచ్చే నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని టూరిజం అధికారులను ఆదేశించారు. గుడిచెరువు ఆవరణలో కొనసాగుతున్న శివార్చన వేదిక పనులు పరిశీలించి, ఆలయ ఈఈ రాజేశ్‌కు సూచనలు చేశారు. తిప్పాపూర్ బస్టాండ్ సమీపంలోని మున్సిపల్ బండ్ పార్క్‌ను పరిశీలించారు. ఏరియా ఆస్పత్రిలో జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ మహేశ్‌రావులతోపాటు రోగులు, వైద్యులతో మాట్లాడారు. ఆర్డీవో రాజేశ్వర్, టూరిజం డీఈ విద్యాసాగర్, జేఈ జీవన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, అర్బన్ తహసీల్దార్ మహేశ్‌కుమార్, ఆలయ ఈఈ రాజేశ్, డీటీసీపీవో అన్సారీ పాల్గొన్నారు.



బొప్పాపూర్‌లో మొక్కులు చెల్లించుకుంటున్న ఆది శ్రీనివాస్

వైభవంగా మల్లికార్జునస్వామి కల్యాణం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం మల్లికార్జునస్వామి కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. నాగవెళ్లి, పెళ్లిపట్నం వేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. రాచర్లగొల్లపల్లిలోని దుర్గమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొన్నారు. బొప్పాపూర్ మల్లికార్జున కల్యాణ వేడుకల్లో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘం ఎన్నికలు



సిరిసిల్లటౌన్: జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘం ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. చైర్మన్‌గా చొప్పరి రామచంద్రం, వైస్‌చైర్మన్‌గా అంబటి శేఖర్, డైరెక్టర్లుగా గాడిచెర్ల శ్రీనివాస్, పని శివ రామకృష్ణ, కూసవేని పర్శరాం, జెట్టి దేవయ్య, గాడిచర్ల దేవయ్య, పిట్ట బాబు, యామ తిరుపతి, నల్ల మోహన్, నిమ్మల బాబు ఎన్నికయ్యారు.

మోడల్‌కోడ్ వాహనాలు రెడీ



వేములవాడ: మోడల్ కోడ్ అందుబాటులోకి రావడంతో వేములవాడ నియోజకవర్గంలో కోడ్ అమలు తీరును పరిశీలించేందుకు మూడు వాహనాలను సిద్ధం చేసి ఉంచారు. అర్బన్ తహసీల్దార్ కార్యాలయం నుంచి నిత్యం నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల్లో పర్యటించి చిత్రీకరించనున్నారు.

బార్ అసోసియేషన్‌కు నామినేషన్లు షురూ..

వేములవాడ: వేములవాడ బార్ అసోసియేషన్ ఎన్నికలకు సోమవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని ఎన్నికల అధికారి కె.విద్యాసాగర్‌రావు తెలిపారు. అధ్యక్షుడి స్థానానికి గుడిసె సదానందం, ప్రధాన కార్యదర్శి స్థానానికి అవదూత రజనీకాంత్, క్యాషియర్ స్థానానికి బొడ్డు ప్రశాంత్, జూనియర్ ఈసీ మెంబర్‌లుగా మహేశ్‌బాబు, వంశీకృష్ణలు నామినేషన్లు దాఖలు చేసినట్లు వివరించారు. ఈనెల 28న ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

హైవోల్టేజీతో ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధం

- లక్షల రూపాయల నష్టం

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం హైవోల్టేజీ విద్యుత్ సరఫరా కావడంతో పలు ఇళ్లల్లోని కూలర్లు, ఫ్రిజ్‌లు, టీవీలు, కంప్యూటర్లు కాలిపోయాయి. మండల కేంద్రంలో సాయంత్రం ఈదురుగాలులు వీయడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడం, ఒక్కసారిగా హైవోల్టేజీ సరఫరా కావడంతో ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. ఒక్క మండల కేంద్రంలోని లక్షల రూపాయల్లో ప్రజలకు నష్టం కలిగినట్లు తెలుస్తుంది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే తరచూ ఇలా జరుగుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పరిహారం..పరిహాసం

- ఏటా ప్రకృతి వైపరీత్యాలకు పంటల నష్టం
- అందని సర్కార్ సాయం
- గత యాసంగిలో 9,065 ఎకరాల్లో పంటనష్టం
- తూతూమంత్రంగా పరిహారం చెల్లింపులు
- ఈ సీజన్‌లోనూ వడగండ్ల వాన
- పరిహారం కోసం ఏళ్లుగా ఎదురుచూపులే..



ముస్తాబాద్‌లో గత సీజన్‌లో తుఫాను ప్రభావానికి నేలకొరిగిన వరిని చూపుతున్న రైతు (ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): దుక్కి దున్ని.. నాట్లు వేసినప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకు రైతులను కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. నాట్లు వేసిన తర్వాత తెగుళ్లు.. పంట చేతికొచ్చే దశలో వడగండ్లు రైతులను ఆగం చేస్తుంటాయి. పంట కోతకు వచ్చిన దశలో వడగండ్ల వాన వచ్చి నిలువున ముంచుతున్నాయి. ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు తూతూ మంత్రంగా వంద మంది నష్టపోతే పది మంది రైతులకు పరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నాయి. ఫలితంగా మెజార్టీ రైతులు నష్టపోతూనే ఉన్నాయి.

కడగండ్లు మిగిల్చిన వడగండ్లు

గతేడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో వడగండ్లు, అకాల వర్షాలకు జిల్లా వ్యాప్తంగా 9,065 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని వ్యవసాయ, ఉద్యానవనశాఖలు ప్రభుత్వానికి నివేదికలు అందించాయి. అయితే కేవలం 100 ఎకరాల్లోని వరిపంటకు రూ.10 లక్షలు, 92 ఎకరాల్లోని మామిడికి రూ.9లక్షల పరిహారం అందజేసి అధికారులు చేతులు దులుపుకున్నారు.

రైతులకు అపారనష్టం

గతేడాది జరిగిన పంటనష్టానికి రైతులు నిండా మునిగారు. వడగండ్ల వాన ప్రభావంతో ఎకరం



ముస్తాబాద్‌లో రాలిపోయిన ధాన్యం

పొలంలో 25 క్వింటాళ్లు వచ్చే ధాన్యం 20 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. ఎకరాకు ఐదు క్వింటాళ్లు తగ్గగా.. 9వేల ఎకరాలలో 45వేల క్వింటాళ్ల ధాన్యం తగ్గింది. ఒక్క క్వింటాలుకు రూ.2వేలు ఉండగా, రూ.9కోట్ల నష్టం వాటిల్లింది. ప్రభుత్వ సాయం అందింది మాత్రం రూ.19లక్షలే. ఇప్పటికీ పరిహారం కోసం రైతులు ఎదురుచూస్తుండగా.. మరోసారి ఈ యాసంగిలోనూ వడగండ్లు పడుతుండడంతో రైతుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

ఫసల్‌బీమాపై అవగాహన ఏది?

ప్రతీ సీజన్‌లో యాసంగి, వానాకాలం పంటల్లో ప్రకృతి వైపరీత్యాలు సహజమే. కేంద్ర ప్రభుత్వం ఫసల్‌బీమా యోజన పథకాన్ని తీసుకొచ్చినప్పటికీ రైతులకు సరైన అవగాహన లేదు. కొత్త ప్రభుత్వం ఈ విషయంలో రైతుల పంటలకు బీమా చేయించే యోచనలో ఉందని తెలుస్తోంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు రైతుబంధు, రుణమాఫీ, రైతుబీమాతో అండగా నిలిచింది. పంటలబీమా కల్పించడంలో క్షేత్రస్థాయిలో సాంకేతిక లోపాలు ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. గ్రామం యూనిట్‌గా తీసుకోవాలా.. మండలం యూనిట్‌గా తీసుకోవాల అనే సందిగ్ధత నెలకొంది. రైతు యూనిట్‌గా బీమా చేస్తేనే అన్నదాతలకు లాభం కలుగుతుంది. రైతులు సైతం పంటల బీమా చేసుకునేందుకు ముందు కురావడం లేదని తెలిసింది. ఏఈవోలు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

పరిహారం కోసం ధర్నా చేశాం



వడగండ్ల వానలకు రెండెకరాలలో వరిపంట దెబ్బతింది. రూ.15వేల నష్టం జరిగింది. ఎకరానికి రూ.10వేలు ఇస్తామన్నారు. రూపాయి రాలేదు. పరిహారం కోసం రైతువేదిక వద్ద ధర్నా కూడా చేశాం. ఈసారైన ఆదుకోవాలి.

– బండారి యాదగిరి, ముస్తాబాద్

పంటల బీమాపై అవగాహన కల్పించాలి



ముస్తాబాద్‌లో పోయిన యాసంగిలో ఐదెకరాలలో ధాన్యం రాలిపోయింది. 25 క్వింటాళ్ల ధాన్యం తగ్గింది. ఇప్పటి వరకు ఒక్క పైసా పరిహారం రాలేదు. మళ్లీ ఇప్పుడు వానలు పడుతున్నాయి. పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పించాలి.

– శాగ మహేశ్, ముస్తాబాద్

నివేదిక అందజేశాం



రైతులకు పంటల బీమాపై అవగాహన కల్పిస్తున్నాం. వడగండ్లు, ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోయిన పంట వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. పరిహారం రాగానే అందజేస్తాం. రైతుల వారీగా పంట బీమా చేయాలని కోరుతున్నారు. నిబంధనల మేరకు పంట బీమా అమలు చేస్తే రైతులకు లాభం జరుగుతుంది.

– భాస్కర్, ఇన్‌చార్జి డీఏవో

నేడు 'రైతునేస్తం' వీడియో కాన్ఫరెన్స్

- జిల్లా వ్యవసాయాధికారి వి.భాస్కర్



వి.భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి

సిరిసిల్ల: జిల్లాలోని చంద్రంపేట, హన్మాజీపేట రైతువేదికల్లో మంగళవారం 'రైతునేస్తం' వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి వి.భాస్కర్ సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభమవుతుందన్నారు. 'వరి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు– వివిధ యాజమాన్య పద్ధతుల'పై జగిత్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్లాంట్ బ్రీడింగ్ శాస్త్రవేత్త బి.శ్రీనివాస్ వివరిస్తారని తెలిపారు. 'ఆయిల్‌ఫామ్ సాగులో తీసుకోవాల్సిన మెలకువలు'పై కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ అగ్రికల్చర్ రాజశేఖర్ వివరిస్తారని, రైతుల సందేహాలకు సమాధానం ఇస్తారు. చివరగా 'వేసవిలో వివిధ కూరగాయపంటల్లో వాడాల్సిన పురుగు మందుల'పై ప్రిన్సిపల్, సైంటిస్ట్ ఎంటమాలజీ డాక్టర్ కే కవిత వివరిస్తారని, రైతుల సందేహాలను నివృత్తి చేస్తారని జిల్లా వ్యవసాయాధికారి వివరించారు. సిరిసిల్ల శివారులోని చంద్రంపేట రైతువేదికలో జరిగే వీడియో కాన్ఫరెన్స్‌కు సిరిసిల్ల, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట, ముస్తాబాద్, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల రైతులు, వేములవాడ మండలం హన్మాజీపేట రైతువేదికలో జరిగే కార్యక్రమానికి వేములవాడ, కోనరావుపేట, చందుర్తి, బోయినపల్లి, రుద్రంగి మండలాల రైతులు హాజరుకావాలని కోరారు.

జిల్లెల్ల చెక్‌పోస్టులో రూ.లక్ష నగదు సీజ్



నగదు సీజ్ చేస్తున్న ఎస్సై సుధాకర్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): పార్లమెంట్ ఎన్నికలకు నగారా మోగిన సందర్భంగా ఎన్నికల కోడు అమల్లోకి రావడంతో తంగళ్లపల్లి మండం జిల్లెల్ల శివారులో ప్రత్యేక చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. కాగా సోమవారం వాహనాల తనిఖీ చేస్తుండగా ఎలాంటి ధ్రువీకరణపత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.లక్ష నగదును పోలీసులు పట్టుకున్నారు. ముస్తాబాద్ మండలం చీకోడుకు చెందిన ఆరుముల్ల స్వామి హైదరాబాద్ నుంచి సిరిసిల్లకు కారులో వస్తుండగా పోలీసుల తనిఖీల్లో రూ.లక్ష పట్టుబడ్డాయి. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసి రశీదు అందజేశారు. ఎన్నికల కోడు అమలులో ఉన్నందున రూ.50వేలకు మించి నగదు ధ్రువీకరణ పత్రాలు లేకుండా తీసుకెళ్లవద్దని అధికారులు తెలిపారు. తనిఖీల్లో తంగళ్లపల్లి ఎస్సై దాస సుధాకర్, పీఆర్ ఏఈ సుమన్, హెడ కానిస్టేబుల్ సుధాకర్ పాల్గొన్నారు.

వస్త్రపరిశ్రమను ఆదుకోవాలి



సిరిసిల్లలో సమావేశమైన ఆసాములు

- హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్ డైరెక్టర్ వర్షిణికి వినతి
- సిరిసిల్లలో ఆసాములు, కార్మికులతో సమావేశం

సిరిసిల్లటౌన్: సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న సిరిసిల్ల ఆసాములు, కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్ డైరెక్టర్ వర్షిణికి వస్త్రపరిశ్రమ వర్గాలు సోమవారం విన్నవించాయి. అనంతరం సిరిసిల్లలో దీక్షలు చేపడుతున్న ఆసాములు సమావేశమై మాట్లాడారు. సిరిసిల్లలో నూలు డిపో ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వాలని, పాతబకాయిలు చెల్లించాలని కోరినట్లు తెలిపారు. ప్రభుత్వ పరమైన పలు ఆర్డర్లు సిరిసిల్లకు కేటాయిస్తామని, ఆసాములు ఆధునిక టెక్నాలజీతో గుడ్డ నేస్తున్న సూరత్ వెళ్లి నేర్చుకోవాలని సూచించారన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలువగా..ఆసాముల డిమాండ్లపై సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కాగా ఆసాములు సిరిసిల్లలో కొనసాగిస్తున్న దీక్షలు సోమవారంతో పదిహేనో రోజుకు చేరాయి. దీక్షల్లో ఆసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్ పాల్గొన్నారు.

గృహజ్యోతి దరఖాస్తుల తిరస్కరణ

- ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలని లబ్ధిదారుల ఆందోళన
- ఎన్నికల కోడ్ ఎఫెక్ట్‌తో కౌంటర్ బంద్



ముస్తాబాద్‌లోని గృహజ్యోతి కౌంటర్ వద్ద లబ్ధిదారుల ఆందోళన

ముస్తాబాద్(సిరిసిల్ల): మండల కేంద్రంలో గృహజ్యోతి అర్జీదారులు ఆందోళనబాట పట్టారు. మండల పరిషత్‌లో ఏర్పాటు చేసిన గృహజ్యోతి దరఖాస్తుల కౌంటర్‌ను ఎన్నికల కోడ్ వచ్చిందని మూసివేయడంపై అర్జీదారులు ఆందోళన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ప్రజాపాలనలో గృహజ్యోతి పథకం కోసం అన్ని రకాల పత్రాలతో దరఖాస్తు చేసుకున్నా తప్పుగా నమోదు చేశారన్నారు. ఇప్పుడు ఎన్నికల కోడ్ వచ్చిందంటూ ఎడిట్ ఆప్షన్ కూడా ఇవ్వకుండా చేయడం సరికాదని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ నమోదు చేయడంలో దొర్లిన తప్పులకు తాము శిక్ష అనుభవిస్తున్నామన్నారు. సవరణకు అవకాశం కల్పించాలని కంప్యూటర్ ఆపరేటర్ రాణితో వాగ్వాదానికి దిగారు. ఆన్‌లైన్‌లో సవరణకు అవకాశం కల్పించకుండా కోడ్ వచ్చిందని మరో మూడు నెలలు నిలిపివేయడం సరికాదని బైరగొని రాజు, కుంబాల రాజిరెడ్డి, లచ్చపేట రాజు, సురేశ్, రామస్వామి, ప్రమీల, గౌరవ్వ, రాజవ్వ పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సిరిసిల్లక్రైం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు సిరిసిల్లటౌన్ సీఐ రఘుపతి తెలిపారు. దాదాపు 48 ఏళ్ల వయస్సు వ్యక్తి జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో నాలుగు రోజుల క్రితం కిందపడిపోయాడని స్థానికులు తెలపడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. సదరు వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. మృతదేహం ఆస్పత్రిలో ఉందని తెలిసిన వారు సిరిసిల్లటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.

అరుదైన వ్యాధితో యువకుడు..

- రూ.15 లక్షలు ఖర్చు చేసినా దక్కని ప్రాణం



సాయికృష్ణ (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): అరుదైన వ్యాధితో నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడు మృతిచెందిన సంఘటన తంగళ్లపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. మండల కేంద్రానికి చెందిన పెరుమండ్ల సాయికృష్ణ (23) లిప్టో స్పైరోసిస్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందాడు. నిరుపేద కుటుంబం కావడంతో అప్పులు చేసి రూ.15 లక్షల వరకు ఖర్చు చేశారు. అయినా ప్రాణాలు దక్కలేదు. మృతుడికి తండ్రి వెంకటేశం, తల్లి లలిత, చెల్లెలు అశ్విత ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు..



నర్సింగం (ఫైల్)

ధర్మారం(ధర్మపురి): కొత్తూరు గ్రామానికి చెందిన భూతగడ్డల నర్సింగం(35) సోమవారం మధ్యాహ్నం చేపలు పట్టేందుకు బావిలో దిగి ప్రమాదవశాత్తు తూరితీగ చేతులకు చుట్టుకోవటంతో మరణించినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన సాగల నారాయణ పొలం వద్దగల వ్యవసాయ బావిలో చేపలు పట్టేందుకు లోనికి దిగిన నర్సింగం.. బావిలోని తూరితీగ చెతులకు చుట్టుకుని నీట మునిగి ఊపిరాడక మరణించినట్లు మృతుడి భార్య రజిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

గొంతునులిమి.. చెట్లపొదల్లో పడేసి..

- ప్రాణం తీసిన మొదటి భర్త
- విడాకులైనా ఇద్దరి మధ్య సాన్నిహిత్యం
- ఆలస్యంగా వెలుగుచూసిన సంఘటన



అంజలి (ఫైల్)

మల్యాల(చొప్పదండి): వారిద్దరూ ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారు. ఇద్దరి మధ్య కలహాలు రావడంతో విడాకులు తీసుకున్నారు. దీంతో యువతిని మరో వ్యక్తికిచ్చి వివాహం జరిపించారు. అయినప్పటికీ ఆమె తన మొదటి భర్తతో సన్నిహితంగానే ఉంటోంది. ఇంతలో ఏమైందో తెలియదుగానీ.. ఆమెను గొంతునులిమి హతమార్చి చెట్లపొదల్లో పడేశాడు. ఈ సంఘటన మల్యాల మండలం మ్యాడంపల్లి శివారులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జగిత్యాల పట్టణానికి చెందిన కరిపే అంజలి.. గొల్లపల్లి మండలం అగ్గిమల్లకు చెందిన కొల్లూరి నరేశ్ ప్రేమించుకున్నారు. నాలుగేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. కుటుంబకలహాల కారణంగా రెండేళ్ల క్రితం విడాకులు తీసుకున్నారు. అనంతరం అంజలిని సిద్దిపేటకు చెందిన వ్యక్తికిచ్చి మరో పెళ్లి చేశారు. అయినా మొదటి భర్త నరేశ్ అంజలితో ఫోన్‌లో తరచూ మాట్లాడుతున్నాడు. రెండు రోజుల క్రితం సిద్దిపేట నుంచి జగిత్యాలలోని పుట్టింటికి వచ్చిన అంజలికి ఫోన్ చేసిన నరేశ్.. ఈనెల 17న తన బైక్‌పై తీసుకెళ్లాడు. మ్యాడంపల్లి శివారులోకి చేరగానే ఇద్దరి మధ్య గొడవ జరగడంతో ఆమె గొంతునులిమి చంపి చెట్లపొదల్లో పడేశాడు. సోమవారం అటుగా వెళ్లిన స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ నీలం రవి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జగిత్యాలకు తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రజాప్రభుత్వంలో చేరండి



సెస్ డైరెక్టర్ నామాల ఉమ-లక్ష్మీరాజం దంపతులకు కండువా కప్పుతున్న విప్ ఆది శ్రీనివాస్

- ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్
- కాంగ్రెస్‌లో చేరిన సెస్ డైరెక్టర్ నామాల ఉమ

వేములవాడ: రాష్ట్రంలో రాచరిక పాలన నుంచి ప్రజాపాలనకు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంతో కలసి రావాలని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. వేములవాడలోని తన నివాసంలో వేములవాడటౌన్ సెస్ డైరెక్టర్ నామాల ఉమ-లక్ష్మీరాజం దంపతులు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అందుబాటులోకి తీసుకొస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలు అమలు చేస్తుందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు. సెస్ డైరెక్టర్ నామాల ఉమలక్ష్మీరాజం దంపతులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు చెప్పారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ బింగి మహేశ్, నాయకులు నామాల పోచెట్టి, తూం మధు, పుల్కం రాజు, శ్రీనివాస్‌గౌడ్, పాత సత్యలక్ష్మి, తోట లహరి, కనికరపు రాకేశ్ తదితరులు ఉన్నారు.



రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుంటున్న ఐజీ రంగనాథ్ దంపతులు



రాజన్నను దర్శించుకునేందుకు ఆలయంలో బారులు తీరిన భక్తులు

కోడెమొక్కుల స్వామికి కోటి దండాలు

వేములవాడ: శ్రీరాజరాజేశ్వరస్వామిని ఐజీ రంగనాథ్ దంపతులు సోమవారం దర్శించుకున్నారు. కోడెమొక్కు చెల్లించుకున్నారు. దర్శనానంతరం వేదోక్త ఆశీర్వచనం గావించారు. ప్రొటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, ఆలయ పర్యవేక్షకులు నాగుల మహేశ్, డీఎస్పీ నాగేంద్రచారి, వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్, రూరల్ సీఐ శ్రీనివాస్ ఉన్నారు. రాజన్నను సోమవారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు.

బీసీ గురుకుల కళాశాలల్లో ప్రవేశాలు

- దరఖాస్తులు ఆహ్వానం

సిరిసిల్లటౌన్: మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల కళాశాలల్లో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌సీవో గౌతం కుమార్‌రెడ్డి, డీసీవో శ్రీనాథ్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 2024–25 సంవత్సరంలో ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశానికి MJPTBCWRJC-2024 వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 13 బాలురు, 13 బాలికల జూనియర్ కళాశాలలు ఉన్నట్లు తెలిపారు.

డీగ్రీ కాలేజీలో ప్రవేశాలు..

బీసీ, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు అర్హులైన ఇంటర్మీడియెట్ సెకండియర్ పరీక్షలు రాసిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. www.mjptbcwreis.telangana.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు రుసుం రూ.200 చెల్లించి ఏప్రిల్ 12వ తేదీలోపు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 28న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ఇంటర్ పూర్తయిన విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

బరాత్‌లో నృత్యం చేస్తూ కరీంనగర్ వాసి..

ఓదెల(పెద్దపల్లి): పెద్దపల్లి జిల్లా ఓదెల గ్రామంలో వివాహ వేడుకలో నృత్యం చేస్తూ కరీంనగర్‌కు చెందిన రావుల విజయ్‌కుమార్(30) హఠాత్తుగా గుండె పోటుకు గురయ్యారు. పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపిన వివరాలు. కరీంనగర్‌కు చెందిన ఓ యువకుడితో ఓదెలకు చెందిన ఓ యువతి వివాహం ఆదివారం జరిగింది. ఆ తర్వాత రాత్రి వేళ భరాత్ జోరుగా జరిగింది. ఇందులో నృత్యం చేస్తుండగా విజయ్‌కుమార్ అకస్మాత్తుగా కుప్పకూలాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య రావుల పల్లవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.